క్లుప్తంగా

మహాలక్ష్మీ అమ్మవారికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాలతో అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ నిర్వహించారు. అమ్మవారికి జరిగిన పంచామృత అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు ఆలయానికి తరలివచ్చారు. అభిషేకం అనంతరం అమ్మవారికి నిత్య అలంకరణ, పూజా కార్యక్రమాలు, పంచహారతుల సేవ నిర్వహించారు. ఉభయదాతల పేరిట కుంకుమార్చనలు నిర్వహించారు.

22న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాల,బాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 22వ తేదీన నూజివీడులోని ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వి.వి.వి. ప్రసాద్ తెలిపారు. 2005 జనవరి రెండో తేదీ తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 22వ తేదీ ఉదయం ఎనిమిది గంటల లోపు ఎంపిక ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ ఐదు నుంచి ఏడో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఆర్.వేణుగోపాల్(9490334333)ను సంప్రదించాలని సూచించారు.

కాలుష్య రహిత సమాజం కోసం మొక్కలు నాటాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కాలుష్యం నుంచి మనల్ని మనం కాపాడుకుని కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన డివిజన్ పరిధిలో బుధవారం మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ ఏక్ పేడ్ మా కె నామ్ (అమ్మ కోసం మొక్క) నినాదంతో పౌరులందరూ మొక్కలు నాటాలని కోరారు. భవిష్యత్ తరానికి స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యాన్ని అందించాలంటే మొక్కలు నాటటం, వాటిని పరిరక్షించడం తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథంపై బుధవారం సింగరాయకొండకు చెందిన నర్తన కళా నిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యాన్ని ప్రదర్శించగా, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడ సేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని వెంకన్న స్వామికి బుధవారం రాత్రి గరుడ సేవ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భాద్రపద మాస పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. సహస్ర నామార్చనలను నిర్వహించారు. భక్తుల గోవింద నామాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదపఠనం, కళాకారుల నృత్యాలతో స్వామి వారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా ముందుకు సాగింది. స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో మూడు సార్లు ఊరేగించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం...

ఆలయంలో ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తులకు తిరుమంజన అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాలు, సుగంధ ఫల పుష్పాది ద్రవ్యాలతో స్వామి వారి అభిషేకాలను నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

సూపర్ సిక్స్ కాదు సూపర్ ఫేక్ పథకాలు



తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి 2024 ఎన్నికల్లో ఇచ్చినది సూపర్ సిక్స్ కాదు. సూపర్ ఫేక్ పథకాలు. ఇది అమలు సాధ్యం కాదని కూటమి నేతలకు తెలుసు. అయినా ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్‌ను చూస్తే భయమేస్తుందంటున్నారు. లోకేష్ వచ్చే ఏడాది అమలు చేస్తామంటున్నాడు. ప్రజలు కూటమి నేతలను నిలదీయాలి.

– షేక్ ఆసిఫ్, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం. ఈ ఏడాది మే నెలలో డిగ్రీ పూర్తయ్యింది. ప్రతి ఏటా జూన్ మాసంలో విద్యాదీవెన నిధులు జమ చేసేవారు. అది కూడా వేయలేదు. తాజాగా డిగ్రీ పూర్తి చేసిన వారికి నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. దానిని ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. నిరుద్యోగ భృతితో తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

– ఆర్‌ఎస్ ఆకాష్‌సాగర్‌సింగ్, విద్యార్థి, వన్‌టౌన్

నిరుద్యోగ భృతి అమలు తేదీ ప్రకటించాలి



ఎన్నికల్లో చెప్పినట్లుగా సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రకటించిన నిరుద్యోగ భృతి ఎప్పుడు నుంచి అమలు చేస్తారో ప్రకటిస్తే బాగుంటుంది. నిరుద్యోగ యువత చాలా మంది ఈ పథకం కోసం ఎదురు చూస్తుంది. ప్రభుత్వం త్వరగా ప్రకటించి అమలు చేయాలి. అప్పుడే ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. మాకు ఉద్యోగం వచ్చే వరకు ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎస్.విజయరామరాజు, విద్యార్థి, వన్‌టౌన్

ఆశగా ఎదురు చూస్తున్నాము..



సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు వాటిని మరచిపోయినట్లు ఉన్నారు. మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తానన్న హామీ ఇప్పుడు ఆయనకు గుర్తులేనట్టు ఉంది. గెలిపించిన మేమంతా ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తారో అని ఎదురు చూస్తున్నాము. నెలకు రూ.1,500తో మాకు ప్రయోజనకరంగా ఉంటుంది.


– జయప్రద, గృహిణి, విజయవాడ

జాప్యం లేకుండా అమలుచేయాలి



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఉద్యోగ ప్రయత్నాలకు నా చేతి ఖర్చుల నిమిత్తమై ఆ నగదు అక్కరకు వస్తాయి. ఈ పథకం నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరం. కానీ ఈ పథకంలో ఎటువంటి జాప్యం లేకుండా అమలుచేయాలని కోరుతున్నాం.

– సీహెచ్ గణేష్, నిరుద్యోగి, గుణదల



ప్రజలకు కూటమి పంగనామాలు

- తల్లికి వందనం ఈ ఏడాది లేనట్లేనని స్పష్టం చేసిన మంత్రి లోకేష్
- సూపర్ సిక్స్ పేరుతో అడ్డగోలు హామీలు
- ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి నేతలు
- పశ్చిమలోనూ సుజనాచౌదరి కోసం పవన్‌కల్యాణ్ ప్రచారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజలకు పంగనామాలు పెట్టేందుకు సన్నద్ధమైంది. అసెంబ్లీ సాక్షిగా పథకాల అమలు లేనట్లేనని చాలా స్పష్టంగా మంత్రులు నోటి వెంట వచ్చాయి. సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం సూపర్ సిక్స్ చూస్తే భయమేస్తుందని చెప్పటం రాష్ట్ర ప్రజలు విస్తుపోయేటట్లు చేసింది. ప్రధానంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆయన ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టారు. అమలులో సైతం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచారు. కానీ చంద్రబాబు బూటకపు వాగ్దానాలతో ప్రజలను మాయ చేసి నేడు అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలపై మాట మార్చారు. మహిళలు ఉచిత బస్సు సదుపాయం, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు రూ.1500 సాయం, తల్లికి వందనం పేరుతో ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులకు రూ.15 వేలు సాయం, మూడు వేలు నిరుద్యోగ భృతి, ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, రైతుకు సాయం కింద ప్రతి ఏడాది రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసింది. వాటి గురించి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాటి అమలు ఎప్పుడో చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



రూ.1,500 సాయం కోసం
1.17 లక్షల మంది ఎదురుచూపులు
రూ.17.55 కోట్లు

ప్రతి మహిళకు నెలకు రూ.1,500

లక్ష మందికి నిరుద్యోగ భృతి
రూ.30 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

తల్లికి వందనం

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం
27.36 కోట్లు
19,546 లబ్ధిదారులు

టీడీపీ పాలన ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం



40 వేల మంది విద్యార్థులు
రూ. 60 కోట్లు

వరద బాధితులకు బాసటగా వైఎస్సార్ సీపీ

- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- గట్టు వెనుక ముంపు ప్రాంతాల్లో బాధితులకు కిట్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విపత్తుల సమయంలో వరద ముంపు బాధితులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయూతనిస్తూ వారికి బాసటగా నిలిచిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం గట్టు వెనుక ప్రాంతంలోని పలు డివిజన్లలో ఆసిఫ్ నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఆయా డివిజన్లలో గల కార్పొరేటర్లు, నాయకులతో కలిసి నష్టపోయిన బాధితులను పరామర్శించారు. అధైర్యపడవద్దని, తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చిట్టినగర్ 47వ డివిజన్‌లో పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్, స్థానిక నాయకులతో కలిసి ఆసిఫ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేరంగుల రమణ, కాశీకృష్ణ, దిద్దుకూరి శివ, బూదాల శ్రీను, ఇలిపిళ్ల విజయలక్ష్మి, నన్నం దుర్గ, మద్దిరాల కమలాకర్, వెంకటేష్, భాస్కర్, ఎండీ అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు. 40వ డివిజన్ పరిధిలోని కరకట్ట సౌత్ రోడ్‌లో బాధితులకు స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డితో కలిసి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పోతిరెడ్డి సుబ్బారెడ్డి, ఎస్వీఆర్, మల్లెల శ్రీనివాసరెడ్డి, కొండలరావు, రమణయ్య, నారాయణ, బడేమియా, అర్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు. భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీ 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి బాధితులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూరసాని రామిరెడ్డి, ఇరువూరి నరసారెడ్డి, ఎండీ అఫ్సర్, జేవీ భాస్కర్, రత్నకుమారి, గోమతోటి వినోద్ కుమార్ పాల్గొన్నారు.



47వ డివిజన్‌లో బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఆసిఫ్, పోతిన మహేష్ తదితరులు



వీఎంసీ కాలనీ వాసులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న కర్నాటి రాంబాబు

వీఎంసీ కాలనీ వాసులకు నిత్యావసరాలు పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురైన 46వ డివిజన్ కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీ వాసులకు బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు బాధితుల ఇళ్లకు వెళ్లి పార్టీ తరఫున సరుకులను అందజేశారు. వరద ముంపునకు గురైన బాధితులకు అండగా ఉండాలని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. వరద సమయంలోనూ బాధితులకు పాలు, మంచినీటి బాటిల్స్, భోజనాలను అందించామని, వరద ముంపు తర్వాత కూడా తమ వంతు సాయం అందించాలనే భావనతో సరుకుల పంపిణీ చేపట్టామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కర్నాటి శివశంకర్, సోమి శ్రీనివాసులు, కరిముల్లా, దుర్గారావు, దస్తగిరి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కోచింగ్ డిపో ఉద్యోగుల చేయూత

కార్మికులకు నిత్యావసరాలు అందజేసిన సీనియర్ డీఎంఈ సంజయ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల వరద ముంపునకు గురైన రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కోచింగ్ డిపో ఉద్యోగులు నిత్యావసరాలు అందజేశారు. ఈ మేరకు బుధవారం కోచింగ్ డిపోలో బాధితులకు సీనియర్ డీఎంఈ సంజయ్ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బుడమేరు వరద ముంపులో కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో నష్టపోయారని వారికి రైల్వే ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా సహాయపడి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సతీష్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు డానియల్, ఎంప్లాయిస్ సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీనియర్ డీఎంఈ సంజయ్

లైసెన్స్ పోర్టర్లకు కమర్షియల్ సిబ్బంది చేయూత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన రైల్వే లైసెన్స్ పోర్టర్లకు విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ సిబ్బంది చేయూత అందించారు. ఈ మేరకు బుధవారం పార్శిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు చేతుల మీదుగా 69 మంది పోర్టర్‌లకు నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం మాట్లాడుతూ వరద వల్ల నష్టపోయిన పోర్టర్‌లకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన కమర్షియల్ సిబ్బందిని అభినందించారు. రూ.2లక్షల వ్యయంతో కిరాణా సరుకులు, దుస్తులు బాధితులకు అందజేశామన్నారు.

ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకేటీపీ స్కూల్‌లో నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలసి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. 300 మంది విద్యార్థులు సేవ్ వాటర్.. సేవ్ లైఫ్ అనే నినాదాల ప్లకార్డులను పట్టుకుని సత్యనారాయణపురంలో పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి యొక్క ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇటీవల బుడమేరు వరద ముంపుతో అనేక ప్రాంతాలు నీటిలో మునిగి ఇళ్లలోని వస్తువులు పనికిరాకుండా పోయాయన్నారు. ఆ సమయంలో చుట్టూ ఎంతో నీరు ఉన్నా వాడుకోవడానికి చుక్క నీరు కూడా ఉపయోగించుకునేందుకు పనికి రాకుండాపోయాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ శివ, చలపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరదలతో ఇబ్బందులు పడ్డ బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావన్నారాయణ కళాశాల యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్ వరద ప్రభావిత గ్రామమైన అంబాపురంలో బాధిత కుటుంబాలకు బుధవారం బియ్యం, చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాన్ని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదలు లక్షలాది మంది ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేశాయన్నారు. ఆ కుటుంబాలకు అవకాశమున్న ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఇన్నర్‌వీల్ క్లబ్ బాధ్యురాలు కరమ్‌కౌర్, క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నేడు నాటిన మొక్కే రేపు రక్షణ కవచం

పటమట(విజయవాడతూర్పు): కాలుష్యం నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నేడు మనం నాటిన మొక్కే రేపు మనకు రక్షణ కవచంగా మారుతుందని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరంలో జరుగుతున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బంది చేపట్టారు. అందులో భాగంగా ఆమె బుధవారం 46వ డివిజన్లో పాల ఫ్యాక్టరీ దగ్గర నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, విజయవాడ నగర పాలక సంస్థను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.



మొక్కను నాటి నీరు పడుతున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పాడి రైతుల సంక్షేమానికి ఢోకా లేదు

విజయ డెయిరీ 33వ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చలసాని

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు వంటి విపత్తులు ఎదురైనా పాల సేకరణ ధర, పాడి రైతుల సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఢోకా ఉండదని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విజయ డెయిరీ(కృష్ణా మిల్క్ యూనియన్) సర్వ సభ్య సమావేశం బుధవారం పాలప్రాజెక్టు ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బుడమేరు ముంపుతో కృష్ణా మిల్క్ యూనియన్‌కు జరిగిన నష్టంపై సమీక్ష నిర్వహించారు. ముంపునకు గురైన ఫ్యాక్టరీని త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ ఏడాది అధిక పాల సరఫరా చేసిన సంఘాలకు, పాల ఉత్పత్తిదారులకు, పాలు అమ్మకాలు చేసిన ఏజెంట్లకు బహుమతి ప్రదానం చేశారు. పాలప్రాజెక్టు సిబ్బంది క్వార్టర్‌లోకి వరద నీరు చేరడంతో నష్టపోయిన 36 కుటుంబాలకు రూ.17లక్షల మేర ఆర్థిక సాయాన్ని అందజేశారు. సమావేశంలో ఎండీ కొల్లి ఈశ్వర బాబు, సమితి పాలక వర్గ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి బీజేపీ క్షమాపణ చెప్పాలి

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్
- విజయవాడ వన్‌టౌన్ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీసీ నిరసన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బీజేపీ తక్షణం క్షమాపణ చెప్పాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు రాహుల్‌గాంధీపై చేసిన పలు వ్యాఖ్యలకు నిరసనగా పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ రాహుల్‌గాంధీని చంపాలంటూ బీజేపీ నాయకులు కామెంట్స్ చేస్తున్నారని, ఇంత దారుణంగా కామెంట్స్ చేస్తున్నా మోదీ, అమిత్‌షాలు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి అని చెప్పడం తీవ్రవాదమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు జేడీ శీలం, నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



విజయవాడ వన్‌టౌన్ గాంధీ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న షర్మిల, పీసీసీ నాయకులు

వరద ప్రభావిత వార్డుల్లో పన్నుల వసూళ్లు తాత్కాలికంగా వాయిదా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుతం విజయవాడలో నెలకొన్న వరద పరిస్థితుల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యాన్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాలైన 32 వార్డులలో(1,5,7,15,16,17,18,19,20,21,22, 30,32,40,41,42,43,44,45,46,47,54,55,56, 57,58,59, 60,61,62,63,64) వచ్చే మూడు నెలల వరకు వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఇతర పన్నుల వసూళ్లను వాయిదా వేస్తున్నామన్నారు.